క్లుప్తంగా

ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల వివరాల నమోదు



ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

సరుబుజ్జిలి: ప్రశస్తయాప్ ద్వారా పాఠశాలల్లోని విద్యార్థులు, ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు నమోదు చేయాలని సరుబుజ్జిలి స్కూల్‌కాంప్లెక్స్ సీఆర్‌ఎంటీ బెండి చిన్నారావు అన్నారు. వెన్నెలవలస గిరిజన బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయాలని, దీనివలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే అన్నిరకాల రాయితీలు, పథకాలు, అలవెన్స్‌లు మంజూరవుతాయన్నారు. ప్రత్యేక పాఠశాల సహాయకులు వి.జగన్నాథం, రామకృష్ణ, సహిత విద్యా ఉపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, అలేఖ్య ఉన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యుడు

కొత్తూరు: మెట్టూరు పీహెచ్‌సీ పరిధి పారాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేత్ర వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 124 మంది విద్యార్థులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకీరామయ్య నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరికి దృష్టిలోపం, మరో 15 మందికి సాధారణ లక్షణాలు ఉన్నట్టు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చిట్టి రవి, హెచ్‌ఎం చంద్రకాంత్, ఉషారాణి, రమేష్, నీలమణి ఉన్నారు.

ఉపాధ్యాయుడుకి సన్మానం



హెచ్‌ఎం రామారావు సత్కరిస్తున్న దృశ్యం

జలుమూరు: జలుమూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మెండ రామారావును ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏడు వందల మొక్కలను పంపిణీ చేయడం, వినూత్న రీతిలో విద్యాబోధన చేపట్టడం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములైనందుకు గ్రామస్తులతో కలిసి శుక్రవారం హెచ్‌ఎంను సత్కరించి అభినందించారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు, పాఠశాల చైర్మన్ డి.హరిత, సహిత విద్యాబోధకులు పి.రమేష్, కృష్ణప్రసాద్, సీఆర్‌పీ పట్ల వైకుంఠరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

సారవకోట: గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి లోకనాథం సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంపై మండలస్థాయి అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 140 గృహాలు నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశలలో ఉన్నాయని.. ఆ నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో మోహన కృష్ణ, ఈఓపీఆర్డీ రేణుక, మండల పరిషత్ ఏవో చిన్నమ్ముడు, గృహనిర్మాణ శాఖ ఏఈ ప్రసాదరావు ఉన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయంతో మల్టీ లోకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో భాగంగా 60 మందికి పైగా రైతులు అడిగి ప్రశ్నలకు శాస్త్రవేత్త డాక్టర్ సందేహాలు తీర్చి.. సలహాలు ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపంటకు ఎక్కువగా సుడిదోమ ఆశించే అవకాశం ఉన్నందున యూరియా వాడకాన్ని తగ్గించి పొటాష్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి తిరుమలరావు, భీమారావు పాల్గొన్నారు.

తెరచుకోని అంగన్‌వాడీ కేంద్రం!

హిరమండలం: తుంగతంపర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శుక్రవారం తెరచుకోలేదు. కేంద్రానికి వచ్చిన పిల్లలు ఉదయం 11 గంటల వరకు వేచి చూసి వెనుతిరిగారు. దీనిపై ఐసీడీఎస్ కొత్తూరు సీడీపీవో వద్ద ప్రస్తావించగా అంగన్‌వాడీ కార్యకర్త విజశ్రీ సెక్టార్ సమావేశానికి హాజరయ్యారన్నారు. కేంద్రాన్ని సహాయకురాలు నీలమ్మ తెరవవలసి ఉందన్నారు. కేంద్రం తెరవకపోయిన విషయం తమ దృష్టికి వచ్చిందని.. హెల్పర్‌కు సంజాయిషీ కోరుతూ మెమో జారీచేశామన్నారు.

వంటింట్లో ధరల మంట!



కూరగాయలు

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన

సరుబుజ్జిలి: మార్కెట్‌లో నిత్యావర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండు నెలలుగా కూరగాయల ధరలు పెరగడమే తప్ప ఎటువంటి తగ్గుదలలేదని చెప్పవచ్చు. గతంలో ఉన్న ధరలకు ప్రస్తుతం వాటికి భారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. దీనివలన కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధిక వర్షాలే కారణం

ఇటీవల కురిసిన వర్షాలతో కూరగాయల పంటలు పూర్తిగా పాడయ్యాయి. మైదాన ప్రాంతాల్లో సాగు చేసిన బెండ, బీర, ఆనప పంటలు దిగుబడి పూర్తిగా పడిపోయింది. దీనివలన మార్కెట్‌లో కూరగాయలు లభించక, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొంతమంది వ్యాపారులు కూరగాయలు కోల్డ్‌స్టోరీజీల్లో నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించి, వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలోల్లో)

కూరగాయలు	ప్రస్తుత ధర	పాతధర
వంకాయి	60	40
బీర	50	40
క్యారెట్	50	40
దొండకాయ	60	40
బంగాళదుంపలు	40	20
చిక్కుడు	45	20
టామాట	60	30
ఉల్లి	70	40
వెల్లుల్లి	320	200

దడపుట్టిస్తున్న వంట నూనె

కూరగాయలతోపాటు వంట నూనెల ధరలు కూడా పెరగడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎడిబుల్, క్రూడాయిల్ దిగుమతులపై ట్యాక్స్ విపరీతంగా పెరగడంతో దాని ప్రభావం వంటనూనెలపై పడింది. కిలో ఆయిల్‌ప్యాకెట్‌పై రూ. 20 నుంచి 25 రూపాయల వరకు పెరడంతో పేదలకు భారంగా మారుతున్నది. కొంతమంది వ్యాపారులు సరకుల నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

స్థానికంగా పంటలు కరువు

ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు మండలం తోలాపి, కనిమెట్ట, బొడ్డేపల్లి, బూర్జ మండలం పెద్దపేట, కాఖండ్యాం, ఆమదాలవలస మండలం పొన్నాం, బట్టేరు, నవనంబాడు, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస, ఇస్కలపాలెం, సుబ్బపేట, పెదమాలపేట, యరగాం, తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, మతలబుపేట, చిగురువలస, వెన్నెవలస, కొండవలస తదితర గ్రామాల్లో మిరప, బీర, దొండ, టమాటా పంటలు సాగుచేసేవారు. అయితే తుఫాన్ల ప్రభావంతో పంటల దిగుబడులు భారీగా తగ్గాయి. దీంతో సప్‌లెక్కై తగ్గ సరకులు లేక మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగాయి. వచ్చేనెలలో మరింత ధరలు పెరిగే అవకాశం ఉందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

ధరలు భరించలేకపోతున్నాము



కూరగాయల ధరలు రోజూ పెరగడమే తప్పితే తగ్గుముఖం పట్టడంలేదు. నెలావారీ బడ్జెట్ పెరిగిపోవడంతో మధ్య తరగతి ప్రజానీకానికి అదనపు భారమవుతోంది. వంటనూనెల ధరలు తగ్గించాలి. మార్కెట్‌లో ధరలు చూస్తే భయమేస్తోంది. ధరలు తగ్గించేందుకు అధికారులు కృషిచేయాలి.

–ఎర్ల సులోచన, బురిడివలస కాలనీ

నష్టపోతున్నాం



భారీ వర్షాలు కురవడంతో కూరగాయల పాదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కష్టపడి పండించిన పంటలు దళారీల పాలవుతున్నాయి. పంటలకు గిట్టుబాటుధరలు కల్పించాలి. ప్రభుత్వ సాయం అందిస్తే సాగు చేయడం సులభమవుతుంది. రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి.

–పి.అప్పలనాయుడు, కూరగాయల రైతు, రొట్టవలస

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పొందూరు: దిలీప్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



పోలాకి: కోడూరు విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పోలాకి: జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఏవీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి పి.దిలీప్‌కుమార్ 200 మీటర్ల పరుగుపందెంలో, బి.శ్యామిని లాంగ్‌జంప్ విభాగంలో రాణించారని తెలిపారు. అలాగే ఈదులవలస మోడల్‌స్కూల్‌లో పూడి ఝాన్సీ, డి.మణికంఠ, డి.వినీత్, డి.భానులు పరుగుపందెంలో, ఫెన్సింగ్‌లో కర్రి చందు మొదటి స్థానం సాధించినట్లు పీడీ నీలం శుక్రవారం తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పొందూరు విద్యార్థి

పొందూరు: శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పొందూరుకు చెందిన దిలీప్ 100 మీటర్ల పరుగుపందెంలో ప్రతిభకనబర్చడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు డి.ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. దిలీప్‌ను హెచ్‌ఎం పి.వెంకట్రావు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఏలూరులో త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నాడు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఆటలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. నియోజకవర్గస్థాయిలో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్‌లలో ప్రతిభ కనబర్చిన పి.వెన్నెల, మేఘన, ఎం.లక్ష్మి, టి.దేవేంద్ర, జి.తేజ్‌కుమార్‌లను ప్రధానోపాధ్యాయులు తంప రామారావు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.రమణమూర్తి, ఇతర ఉపాధ్యాయులున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆయా నియామకం!

ఎల్.ఎన్.పేట: తురకపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండు నెలల క్రితం నిబంధనలకు విరుద్ధంగా ఆయాని నియమించారని ఎస్‌ఎంసీ చైర్మన్ కర్నం శ్రీను, వైస్ చైర్మన్ చింతాడ యమునలు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం వరకు పాఠశాల ఆయాగా పనిచేస్తున్న పందిరి నాగరత్నంను తొలగించి ఆమె స్థానంలో వానపల్లి సుజాతను ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎంలు నియమించారని ఆరోపించారు. వీరు నియమించిన ఆయా సుజాత పిల్లలు పాఠశాలలో చదవటం లేదన్నారు. ఆమెకు చదువుకునే పిల్లలు కూడా లేరని, పిల్లలు లేని వారిని పాఠశాల ఆయాగా ఎలా నియమించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయా నియామకంలో విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం తీసుకోలేదన్నారు. ఎంఈఓ కార్యాలయంలో నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు.

తమ దృష్టికి రాలేదు..

పాఠశాల ఆయా నియామకానికి సంబంధించిన సమాచారం తన వరకు రాలేదని ఎంఈవో-1 మణికుమార్ అన్నారు. అక్కడ ఏమి జరుగుతుందో టీచర్‌తో మాట్లాడి సమస్యను డీఈవో దృష్టికి తీసుకుని వెళ్లి చర్యలు తీసుకుంటానని చెప్పవుర. పిల్లల తల్లిదండ్రులే ఆయాగా ఉండాలని ఏమీ లేదని, 50 ఏళ్ల వయసున్న వారు ఆయాగా ఉండవచ్చన్నారు.

7 నుంచి గ్రామ దేవత మహోత్సవాలు

నరసన్నపేట: స్థానిక శివనగర్ కాలనీ కూడలిలో ఉన్న అసిరితల్లి గ్రామదేవత అమ్మవారి ఉత్సవాలను అక్టోబర్ ఏడు నుంచి 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీ ప్రతినిధి చింతు పాపారావు మాట్లాడుతూ.. భక్తులు, స్థానికులు ఈ మహోత్సవాల్లో క్రమశిక్షణగా పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో వరదరాజులు, పార్వతీశం, హరికృష్ణ, గణపతి, మల్లేసు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు అంకురార్పణ



అంకురార్పణ పూజల్లో భక్తులు

సారవకోట: మండల కేంద్రంలో వచ్చే నెల మూడు నుంచి ప్రారంభంకానున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక మోటార్ యూనియన్, వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నారు. దీని కోసం రుత్వికులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో అంకురార్పణ, పందిరి రాట కార్యక్రమాన్ని భక్తులచే చేయించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- పాతపట్నం సీఐ నల్లి సాయి



మాట్లాడుతున్న సీఐ నల్లి సాయి

పాతపట్నం: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మారక ద్రవ్యాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోక్సో యాక్టు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినులు అత్యవసర సమయంలో 112కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోను అభినందిస్తున్న సిబ్బంది

సారవకోట: సారవకోట ఎంపీడీవోగా మురళీమోహన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకూ పని చేసిన ఆర్.రాంబాబు సాధారణ బదిలీలలో విజయనగరం జిల్లాకు వెళ్లారు. సరుబుజ్జిలి ఎంపీడీఓగా ఉన్న మురళీమోహన్ సారవకోటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఈయకు కార్యాలయపు సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

పొందూరు: స్థానిక జంగాలవీధిలో అక్కమాంబ గుడి సమీపంలో నిర్వహించిన వినాయకుని సంబరాలను పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్న సమారాధన జరిపారు. కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఇక్కడ 21 రోజులు గణనాథుడు పూజలందుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలి



మాట్లాడుతున్న పీవో విమలకుమారి

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుపడాలని ఐసీడీఎస్ సీడీపీవో యూ.విమలకుమారి అన్నారు. పెద్దసంకిలి, హిరమండలం, చొర్లంగి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ.. కేంద్రాల నిర్వహణ విషయంలో సమయపాలన పాటించాలన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రాల్లో కార్యకర్తలు ఉండాలన్నారు. ప్రతినెల ఐదో తేదీలోగా రేషన్ డీలర్ నుంచి సరుకులు విడిపించుకోవాలన్నారు. ప్రతినెల మెదటి, మూడు శుక్రవారాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు సుధావాణి, ఈశ్వరమ్మ ఉన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు



స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేటలోని పలు వీధుల్లో విద్యుత్ దీపాలను పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. అంధకారంలో వీధులు శీర్షికతో ఈ నెల 27వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. దీంతో స్టేట్‌బ్యాంకు, బైరాగి వీధుల్లోని స్తంభాలకు లైట్లను అమర్చారు. లైట్లు లేకపోవడంతో సాయంత్రమైతే చీకటితో ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేద్దాం

హిరమండలం: చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, సీనియర్ నాయకుడు ఏవీ సురేష్‌లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల పవిత్రతకు చంద్రబాబు భంగం కలిగించారన్నారు. తిరుమల లడ్డూకు వాడే నెయ్యి కల్తీ అయిందని ప్రసాదం పవిత్రతను చంద్రబాబు అప్రతిష్ఠ పాల్జేస్తున్నారన్నారు. బాబు చేసిన పాపలను ప్రక్షాలన చేసేందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాల మేరకు శనివారం ఆలయాల్లో పూజలు చేయనున్నట్టు పేర్కొన్నారు. మేజర్ పంచాయితీ హిరమండలం శుబలయ మెట్ట తపోగిరిపై వెలసియున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు రెడ్డిశాంతి ఆధ్వర్యంలో పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపనిచ్చారు.

పొందూరు: మండలంలోని కోటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు పూజలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి విశిష్టతను దెబ్బతీసేలా చంద్రబాబు చేసిన పాపానికి ప్రక్షాళనగా ఈ పూజలు చేస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి తెలిపారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు చేయండి



నరసన్నపేట: మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహనరావు



హిరమండలం: సమావేశంలో మాట్లాడుతున్న ఉపతహసీల్దార్ వెంకటరమణ

నరసన్నపేట: నియోజకవర్గంలో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉందని.. అవసరమైన ప్రతిపాదనలు చేయవచ్చని ఆర్వో రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల మార్పునకు, కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయవచ్చని అన్నారు. అర్హులు కొత్తగా ఓటర్లుగా చేరవచ్చని, ఉన్న వారు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, పేర్లు తప్పులు ఉంటే సరిచేసుకోవచ్చని అన్నారు. నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జలుమూరు, పోలాకి, సారవకోట తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, విజయలక్ష్మి, నరసన్నపేట డీటీ శరత్, నాయకులు పలువురు పాల్గొన్నారు. కాగా రాజకీయ పార్టీల సమావేశానికి సమాచారం ముందస్తుగా ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి నర్సింహమూర్తి అన్నారు.

హిరమండలం: మండలంలోని సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పోలింగ్ కేంద్రం నంబర్ 291లో 1646 ఓటర్లు ఉన్నారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్లు మాత్రమే ఉండాలి. రెండో కేంద్రం ఏర్పాటు కోసం ఆ గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉపతహసీల్దార్ వెంకటరమణ సమావేశం నిర్వహించారు. ఉన్న కేంద్రాన్ని రెండుగా మార్చే విషయమై రాజకీయ నాయకుల అనుమతి కోసం సమావేశం నిర్వహించినట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పి.బుచ్చిబాబు, ఏవీ సురేష్, ఎం.రామకృష్ణ, బి.సురేష్ ఉన్నారు.

తమ్మినేనికి సత్కారం



తమ్మినేనిని అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

ఆమదాలవలస: శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులుగా నియమితులైన తమ్మినేని సీతారాంకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు..సీతారాంను తన నివాసంలో శుక్రవారం సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, పొడుగు శ్రీను, దుంపలు చిరంజీవి, కుసుమంచి శ్యాంప్రసాద్, సిల్లా మల్లికార్జునరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రాజు, పొన్నాడ చిన్నారావు, గుడ్ల బాబు, కుప్పిలి సత్యనారాయణ, పాదిలాపు తిరుపతిరావు, బొడ్డేపల్లి రమణమూర్తి ఉన్నారు.

ప్రజలు గమనిస్తున్నారు



మాట్లాడుతున్న అప్పన్న

కొత్తూరు: సూపర్‌సిక్స్ హామీలు నేరవేర్చలేని కూటమి ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టించడానికి తిరుమల లడ్డూ ప్రసాదాన్ని తెరపైకి తెచ్చిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి దూలి అప్పన్న అన్నారు. ఇటువంటి నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దేవదేవుడు, కలియగ దేవుడుగా పేరుపొందిన తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి అనుమతి కోరాలనడం అమానుషమని అన్నారు. మాజీ సీఎం హోదాలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని స్వామి దర్శనం కోసం అనుమతి ఉండాలని అనడం కూటమి ప్రభుత్వం దిగజారుతనానికి నిదర్శనమన్నారు.

సంక్షిప్తంగా..

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక సివిల్ కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు స్థానిక సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నరసన్నపేట, పోలాకి మండలాల పరిధిలో పనిచేయడానికి వీలుగా దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలని, ఎంపికైన వారికి ఎటువంటి పారితోషికం ఉండదని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు అక్టోబర్ ఎనిమిదో తేదీలోగా దరఖాస్తులు అందచేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 8008 575927 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో సునీత

నరసన్నపేట: ఎరువుల షాపుల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. అలాగే అధిక ధరలకు విక్రయాలు చేయవద్దని కోరారు. స్థానిక కాలేజీ రోడ్డులో గాయిత్రి షీడ్స్ దుకాణాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా షాపుల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. షాపులో కొన్ని పురుగుల మందుల నమూనాలను సేకరించి తాడేపల్లి గూడెం పరీక్షా కేంద్రానికి పంపించినట్టు పేర్కొన్నారు.

మొబైల్‌కు బానిసకావద్దు

పోలాకి: విద్యార్థి దశలో మొబైల్‌ఫోన్‌లకు బానిసకావద్దని పోలాకి ఎస్ఐ రంజిత్ సూచించారు. ఈదులవలస మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్‌మీడియా అనేక నేరాలకు ప్లాట్‌ఫారం కానున్న నేపథ్యంలో అవసరం మేరకు, అవగాహన కోసం మాత్రమే టెక్నాలజీని వాడాలని వివరించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన



భోజనాలను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ సుజాత

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహానికి నిర్వహణ నిధులు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూఓ ఎస్.సుజాత తెలిపారు. ఆమదాలవలస పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నుంచి భోజన సదుపాయాలు, వసతులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. బాలుర వసతి గృహం లో రన్నింగ్ వాటర్ మరమ్మతులు, బాత్ రూములకు కిటికీలు, దోమల మెస్ ఏర్పాటు చేస్తామన్నారు. వార్డెన్ ఎస్‌కే బాష, మెట్రిన్ నలిని ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ సూచించారు. కొర్లకోట గ్రామంలో సైబర్ మోసాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

మినీ గోకులాల లబ్ధిదారులను గుర్తించండి

పాతపట్నం: మినీ గోకులం పథకంలో త్వరితగతిన లబ్ధిదారులను గురించాలని, నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యాధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడి రైతులకు బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువైద్య సిబ్బంది పాడిరైతులకు అందుబాటులో ఉండాలన్నారు. 21వ అఖిలభారత పశుగణన కిట్లను ఏడీ పంపిణీ చేశారు. పశువైద్యులు బి.శ్రీవాణి, పి.అనిల్ కుమార్, కె.మౌనిక ఉన్నారు.